క్లుప్తంగా

మలేరియాను నిర్మూలిద్దాం


ఒ.దినేష్

మొగల్తూరు: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఒ.దినేష్ సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మలేరియాను నిర్మూలించాలంటే ముందుగా దోమల లార్వాను నిర్మూలించాలన్నారు. ఇంటి ఆవరణలో పనికి రాని వస్తువుల్లోనూ, పాత టైర్లల్లోనూ, లేదా మురుగు నీరు నిలిచి పోయినా దోమలు పెరిగిపోతాయన్నారు. దోమల నుంచి లార్వా ప్రభలుతుందని, అవి కుట్టడం ద్వారానే జ్వరాలు వస్తాయన్నారు. ఎవరికైనా జ్వరం లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రతించాలన్నారు. దోమలు కుట్టడం ద్వారా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గుండెపోటుతో రంగారెడ్డి మృతి


రంగారెడ్డి(ఫైల్)

పెనుమంట్ర: మండలంలోని నత్తారామేశ్వరం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏ1 కాంట్రాక్టర్ ద్వారంపూడి శ్రీనివాస రెడ్డి సోదరుడు హైదరబాద్‌లోని గ్లోబల్ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత ద్వారంపూడి మురళీకృష్ణ రంగారెడ్డి (57) బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. ఆయన అంత్యక్రియలు ఆయన స్వగ్రామం నత్తారామేశ్వరం గ్రామంలో గురువారం ఉదయం జరుగుతాయని ఆయన బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి


ప్రసన్నకుమార్

పాలకొల్లు అర్బన్: మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వర్దనపు ప్రసన్నకుమార్ (45) బుధవారం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. ప్రసన్నకుమార్ మృతిపై ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, ఎంపీడీఓ బి.అనుపమ, ఏఓ కె.గోవిందరాజులు, ఈవో పీఆర్డీ కేఎం వైభవవతి తదితరులు సంతాపం తెలిపారు.

ఫార్మసీ విద్యార్థులకు క్యాంపస్ కొలువులు



క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న పూర్ణకుమార్

భీమవరం: స్థానిక కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో బుధవారం దివిస్ ఫార్మాల్యాబ్ నిర్వహించిన క్యాంపస్ ప్లేసెమెంట్ డ్రైవ్‌లో 19 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు 15 మంది, ఇతర కళాశాలలకు చెందిన నలుగురు ఉన్నారు. వీరంతా విశాఖపట్నం, కాకినాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉన్న దివిస్ ఫార్మాల్యాబ్‌లోని బల్క్‌డ్రగ్ ప్రొడక్షన్ విభాగంలో పని చేస్తారని కంపెనీ హెచ్ఆర్ పూర్ణకుమార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కె.నాగేశ్వర రావు, ప్రిన్సిపాల్ డి.రాఘవ, వైస్ ప్రిన్సిపాల్ కె.నిర్మల తదితరులు అభినందించారు.

కాలువల్లో తూడు తొలగేదెన్నడో..?

- సాగునీటి పారుదలకు ఆటంకాలు...
- మరమ్మతులకు నోచుకోని పంట కాలువలు


భగ్గేశ్వరం పంటకాలువ దుస్థితి


భగ్గేశ్వరం మొగల్తూరు డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి గట్లు జారిపోయిన దృశ్యం


రాపాక చానెల్‌లో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పంట కాలువలు అధ్వానంగా మారాయి. గుర్రపు డెక్క, తూడు పెరిగిపోయి నీటి పారుదలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రాపాక చానెల్, భగ్గేశ్వరం డ్రెయిన్, మొగల్తూరు డ్రెయిన్, గోరింటాడ ఓల్డ్ నెం.1 చానెల్, గోరింటాడ డ్రెయిన్, దిగమర్రు పంట కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందుతోంది. అయితే ఈ పంటకాలువలు ఆక్రమణలు గురయ్యాయి. అంతేకాకుండా పంట కాలువలను తవ్వకపోవడంతో పూడకుపోయి సాగునీరుకి ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. రాపాక చానెల్‌ను ఆనుకుని అరట్లకట్ట, వెంకటాపురం, పొలమూరు, గవరపేట, వాలమర్రు, కాపవరం, లంకలకోడేరు, వెలివెల, దగ్గులూరు, బల్లిపాడు, శివదేవునిచిక్కాల, తిల్లపూడి గ్రామాల్లోని సుమారు 6వే ల ఎకరాలకు సాగునీరు అందుతోంది. అలాగే ఈ గ్రామాల్లోని పంచాయతీ చెరువులకు కూడా ఇదే పంట కాలువ నుంచి మంచినీరు కూడా సరఫరా అవుతోంది. పంట కాలువల్లోకి చనిపోయిన కోళ్ల కళేబరాలు, పశువుల కళేబరాలు, ఇతర చెత్త పడవేయడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల సాగునీరు సరఫరాకి ఆటంకాలు ఎదురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని పంట కాలువలదీ అదే స్థితి

దిగమర్రు పంటకాలువను ఆనుకుని వరిధనం, పెదగరువు, కొంతేరు, కాజ, దిగమర్రు, పెదమామిడిపల్లి, కొత్తపేట గ్రామాల్లోని సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. అలాగే మొగల్తూరు, భగ్గేశ్వరం డ్రెయిన్‌ల నుంచి పలు గ్రామాలకు సాగునీరు అందిస్తున్నారు. పంట కాలువలు తూతూ మంత్రంగా ఉపాధి హామీ పథకంలో పైపైన చెత్త తొలగించడం తప్ప శాశ్వత మరమ్మతులు చేయడం లేదు. దీంతో అధిక వర్షాలు వచ్చినప్పుడు పంట చేలల్లోని నీరు బయటకు వెళ్లే మార్గం లేక ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో నారుమడులు, నాట్లు దశల్లోనే పంట చేలు ముంపు బారిన పడడం వల్ల రెండు, మూడు సార్లు రైతులు నాట్లు వేసుకుంటున్నారు. కొంత మంది రైతులయితే ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేయడం మానుకుంటున్నారు. తక్షణం అధికారులు స్పందించి పంట కాలువల్లోని తూడు, గుర్రపు డెక్క తొలగించి సాగునీటి పారుదలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



రాపాక చానెల్‌కి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి. పంట కాలువ ఆక్రమణలకు గురైంది. దీనివల్ల రైతులకు సాగునీరు అందడం లేదు. అలాగే పంట చేలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి కాలువ తవ్వకం పనులు చేపట్టాలి.

– బందెల నరేష్, బల్లిపాడు

పంట కాలువ పూడిపోయింది



ఉపాధి హామీ పథకంలో రాపాక చానెల్ పంట కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క తొలగిస్తున్నారే తప్ప పంట కాలువ తవ్వడం లేదు. దీంతో పంట కాలువ పూడుకుపోయింది. మండలంలోని అన్ని పంట కాలువలు ఇదే దుస్థితిలో ఉన్నాయి. వర్షాకాలంలో నీరు పారుదలకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– తందా ఇస్సాక్‌రాజు, కౌలు రైతు, శివదేవునిచిక్కాల

ఏపీ ఈఏపీ సెట్‌లో ఎస్వీకేపీ విద్యార్థుల ప్రతిభ

పెనుగొండ: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో కోచింగ్ తీసుకొన్న విద్యార్థుల్లో 70 శాతానికి పైగా విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రి కల్చర్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశానికి అర్హత సాధించారన్నారు. ముగ్గురు విద్యార్థులు 10 వేల ర్యాంకుల లోపు, ముగ్గురు 20 వేల ర్యాంకులలోపు సాధించారన్నారు. అర్హత సాధించిన విద్యార్థులను పాలక వర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ తదితరులు అభినందించారు.

డ్రెయిన్లలో సిల్టు తొలగించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మున్సిపల్ కార్యాలయంలో గురువారం పట్టణ పారిశుద్ధ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలోపు పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీయించేందుకు తగు ప్రణాళికతో సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఎంతవరకు డీసిల్టేషన్ వర్క్ పూర్తయ్యిందో అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో డీసిల్టేషన్ చేసిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు.

నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం


మొగల్తూరులోని పెన్మత్సరంగరాజు ఉన్నత పాఠశాల


మార్టేరు జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాలు.

మొగల్తూరు: ఈ ఏడాది పాఠశాలలు ఒక రోజు ఆలస్యంగా ప్రారంభం కానున్నాయి. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉండగా రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనుండటంతో బుధవారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీంతో అధికారులు ఓ రోజు ఆలస్యంగా గురువారం నుంచి పాఠశాలు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేయడంతో విద్యాశాఖాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. మొగల్తూరు మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి ప్రాథమిక పాఠశాలలు 68, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 10 ఉన్నాయి. అధికారుల అంచానాల మేరకు మొత్తం విద్యార్థులు 4842 మంది ఉంటారని అంచానా వేసి 46,150 పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ పంపించగా ఇప్పటివరకు 29,078 పుస్తకాలు స్టాక్ పాయింట్‌కు చేరాయి. ఇంకా రావాల్సిన పుస్తకాలతో పాటు విద్యా కానుక కిట్లుకూడా మరో రెండు రోజుల్లో రానున్నాయని ఎంఈఓ శామ్యూల్ జాన్ బుధవారం విలేకరులకు తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభంకానున్నాయి. మండలంలో 35 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలు ఉండగా, నెగ్గిపూడిలో మహాత్మారావు బాపూజీ పూలే ఏపీ బీసీ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాల కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మండలంలోని నెగ్గిపూడి మార్టేరు, ఆలమూరు, పెనుమంట్ర, పొలమూరు, మాముడూరు, జుత్తిగ, గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఉండగా, ఈ పాఠశాలల్లో అనేక మంది విద్యార్థులు 500 మార్కులు పైగా సాధించి ప్రైవేటు పాఠశాలకు దీటుగా తమ ప్రతిభను చాటుకున్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నాడు -నేడు నిధులతో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడంతో ఆయా పాఠశాలలు నేడు విద్యార్థులకు సుందరంగా స్వాగతం పలుకుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంనాటికే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, షూలు, టైలు, మొదట విడతగా సరఫరా కాగా, ఇంకా యూనిఫాం రావాల్సి ఉందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పెనుమంట్ర ఉన్నత పాఠశాలలో గతేడాది ఇంటర్మీడియట్ కో ఎడ్యుకేషన్ ప్రారంభంకాగా, ఈ ఏడాది నెగ్గిపూడిలోని శ్రీవేణుగోపాల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్ కో-ఎడ్యుకేషన్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభంకానున్నాయని, అందుకోసం ఈ పాఠశాలల్లో అడ్మిషన్లు కూడా తీసుకుంటున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మంచినీటి చెరువు నింపే పనుల ప్రారంభం


చెరువు నింపే పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వెంకటరమణ

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ మంచినీటి చెరువును నింపే పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ప్రారంభించారు. ప్రధాన పంట కాలువకు నీటిని విడుదల చేయడంతో కాలువ నుంచి మోటార్ల ద్వారా చెరువులో నీటిని నింపే పనులు దీందో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి భారీ విస్తీర్ణంలో చెరువు అందుబాటులో ఉంది కాబట్టి 40 రోజులకు సరిపడా నీరు నిల్వ ఉంటుందని చెప్పారు. వేసవిలో కూడా రెండు పూటలా నీరు ఇవ్వగలిగామన్నారు. ఇప్పుడు కాలువ నుంచి మోటార్ల ద్వారా చెరువులోకి నింపుతున్నామని చెప్పారు. చెరువు నింపే పనులు త్వరితగతిన పూర్తి చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వై.సునీల్, మల్లాడి బుజ్జి పాల్గొన్నారు.

వంతెన మార్గం ప్రమాదకరం


ప్రమాదకరంగా ఉన్న వంతెనమార్గం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలేనికి వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ,ఇటూ కూడా రాళ్లు పైకిలేచి పోయాయి. రోడ్డు కూడా శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రీస్కూల్ నుంచి ప్రైమరీ స్కూల్స్‌కు..


విద్యార్థులను ప్రైమరీ స్కూల్స్‌కు సిద్ధం చేసిన అంగన్‌వాడీ టీచర్లు

పెనుమంట్ర: మండలంలోని వివిధ అంగన్‌వాడీ స్కూల్స్‌కు చెందిన ప్రీస్కూల్ విద్యార్థులను ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో బుధవారం చేర్పించారు. అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్ విద్యను పూర్తిచేసిన 5 ఏళ్లు నిండిన బాలబాలికలకు సర్టిఫికెట్లు ఇచ్చి జాయినింగ్ కోసం ప్రభుత్వ పాఠశాలలకు పంపించారు. పెనుమంట్ర గ్రామంలో 8 అంగన్‌వాడీలకు చెందిన విద్యార్థులను ఆయా అంగన్‌వాడీ టీచర్స్ పి.శాంతి, ఎన్.అరుణకుమారి, ఎ.వెంకటలక్ష్మి, కె.మంగాయమ్మ, పి.సత్యవేణి, ఎస్.వెంకటరత్నం, బి.సుజాత, టీవీ సుబ్బలక్ష్మి తదితరులు తమ పరిధిలోని పిల్లలను ప్రైమరీ పాఠశాలల్లో జాయిన్ చేశారు.

నిమ్మలకు మంత్రి పదవిపై హర్షం


క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ శ్రేణులు

పాలకొల్లు సెంట్రల్: 30 ఏళ్ల అనంతరం పాలకొల్లు నియోజకవర్గానికి మళ్లీ 2024లో మంత్రి పదవి దక్కిందని టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాష్ట్ర మంత్రిగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని వీక్షించేందుకు స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద మెయిన్‌రోడ్డులో కుభేరస్వామి ఆలయం ఎదురుగా, మండల కేంద్రాల్లో అధికారులు ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. జనం అధిక సంఖ్యలో పాల్గొని ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే కొందరు మహిళలు వెళ్లిపో నిమ్మల రామానాయుడు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చాలా మంది వెళ్లిపోయారు. రామానాయుడు ప్రమాణస్వీకారం అనంతరం పట్టణ, గ్రామాల్లో పలు కూడళ్లలో ర్యాలీలు నిర్వహించారు. స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మాజీ కౌన్సిలర్ శ్రిఖాకొల్లు వెంకన్న, గాదె వెంకన్నల ఆధ్వర్యంలో స్వామివారికి 108 కొబ్బరికాయలు కొట్టారు.

ప్రమాణ స్వీకారాన్ని వీక్షించిన నాయకులు

పెనుగొండ: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడాన్ని తిలకించడానికి ఆచంట, పెనుగొండ మండలాలో ఎల్ఈడీల్లో స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెనుగొండ గాంధీబొమ్మల సెంటర్ లోనూ, ఆచంటలోనూ ఎల్ఈడీలను ఏర్పాటు చేశారు. అనంతరం వడలి, భీమలాపురం, వల్లూరు, కొడమంచిలిల్లో టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో 11కేవీ వెలివెల ఫీడర్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నరసాపురం సబ్‌డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా దగ్గులూరు, బల్లిపాడు, శివదేవునిచిక్కాల, శ్రీలంకపుంత ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల ఫలితాల విడుదల


సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ జూన్ 7న కళాశాలలో జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షల్లో (ఇంటర్నెషిప్ ఎవెల్యూషన్) 272 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫలితాల్లో 98.53 శాతంతో 268 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.కృష్ణ, ఎగ్జామ్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా


షేక్ బులిమస్తాన్

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంతో పాటుగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ నరసాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ షేక్ బులిమస్తాన్ గురువారం రాజీనామా చేశారు. రాజీనామాను సొసైటీ కార్యదర్శి ఎం.శ్రీనివాసబాబుకు అందించారు. ఏడాది క్రితం సొసైటీకి త్రిసభ్య కమిటీని నియమిస్తూ చైర్మన్‌గా బులిమస్తాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. చైర్మన్ బులిమస్తాన్‌తో పాటుగా సభ్యులు చల్లా సత్యనారాయణ, మైలాబత్తుల మరియమ్మ కూడా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా బులిమస్తాన్ మాట్లాడుతూ 104 ఏళ్ల చరిత్ర కలిగిన సొసైటీకి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఇచ్చారన్నారు. ఆయనతో పాటు సొసైటీ ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు. భవిష్యత్‌లో సొసైటీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు.

గుండెపోటుతో యలమంచిలి సొసైటీ సీఈవో మృతి


టీవీఎస్ఎన్ ప్రసాద్

యలమంచిలి: యలమంచిలి సొసైటీ సీఈఓగా పనిచేస్తున్న టీవీఎస్ఎన్ ప్రసాద్ (బుజ్జి) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుజ్జి అకాల మరణం పట్ల సొసైటీ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.